క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: చెరువులు, కుంటల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని మున్సిపల్ కమిషనర్ తిప్ప రాజు రమేశ్ కోరారు. పట్టణంలోని చెరువు వద్ద శనివారం మున్సిపల్ కార్మికులతో ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వార్డ్ ఆఫీసర్ కుమారస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, బిల్ కలెక్టర్ కృష్ణ, రాజు, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



యైటింక్లయిన్‌కాలనీ: శ్రావణమాసం సందర్భంగా రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భానుప్రసాద్‌చార్య ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

మాజీ సైనికులకు సన్మానం



సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు

సుల్తానాబాద్: కార్గిల్ విజయ్ దినోత్సవం సందర్భంగా సుల్తానాబాద్ ఐపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సైనికులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. విశ్రాంత మాజీ సైనికులు జూపల్లి దామోదర్‌రావు, వేములవాడ నారాయణ, పిట్టల వెంకటస్వామి, గుర్రం సదానందంగౌడ్‌ను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు, జోన్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా హంగర్ రిలీఫ్ కో–ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, క్లబ్ ఉపాధ్యక్షులు పూసాల సాంబమూర్తి, కన్న రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేశ్

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక విద్యార్థులకు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నిర్వహణ, నేరాల నియంత్రణ, సైబర్‌నేరాలు, ఆయుధాల చట్టాల గురించి అవగాహన కల్పించారు.

క్రీడాకారుడికి అభినందన



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాయికుమార్

సుల్తానాబాద్: వరంగల్‌లో ఆగస్టు 3న జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వివేకానంద కళాశాల విద్యార్థి మనోజ్ కుమార్ ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సాయికుమార్ తెలిపారు. కళాశాలలో విద్యార్థి మనోజ్‌కుమార్‌ను శనివారం అభినందించారు. 19న రామగుండంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మనోజ్ కుమార్‌ను విద్యార్థులు అభినందించారు. వివేకానంద విద్యాసంస్థల డైరెక్టర్ రవికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజిత, వ్యాయామ ఉపాధ్యాయులు ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఈజీఎస్ 16వ విడత సామాజిక తనిఖీ

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 28న ఉపాధిహామీ 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో సదానందం తెలిపారు. 2024 నుంచి 2025 మార్చి 31 వరకు గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించిన వివరాలు, పనిదినాలు, కూలీలకు వేతనాల చెల్లింపులపై చేపట్టిన తనిఖీల తుది నివేదిక వివరాలు ఈజీఎస్ అధికారుల సమక్షంలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

ఆందోళన వద్దు.. అందుబాటులో యూరియా

- ఆగస్టు వరకు సరిపడా నిల్వలు ఉన్నాయి: వ్యవసాయ అధికారులు



సుల్తానాబాద్‌లోని గ్రోమోర్ సెంటర్‌లో ఉన్న యూరియా నిల్వలు

సుల్తానాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా సింగిల్ విండోలతో పాటు డీలర్లకు, ఏజెన్సీలకు సరఫరా చేశారు. కానీ కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జరిగిన జిల్లా వ్యవసాయ అధికారుల సమీక్ష సమావేశంలో యూరియా కొరత లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

యూరియా నిల్వలు..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ సెంటర్లలో 9030 మెట్రిక్ టన్నుల యూరియా ఉంది. ఇప్పటివరకు రైతులు 6805 మెట్రిక్ టన్నులు తీసుకెళ్లారు. డీఏపీ 656 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 4748 మెట్లు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 50వేల ఎకరాల్లో వరి, 44,201 ఎకరాల్లో పత్తి, 150 ఎకరాల్లో ఇతర వాణిజ్య పంటలు సాగయినట్టు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. ఎకరాకు ఒక యూరియా బస్తా మాత్రమే అవసరం ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఒకేసారి అవసరం కావడంతో..

ఈసారి సీజన్ ప్రారంభం కన్నా ముందే వర్షాలు పడడంతో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. అవి మొలకెత్తి మొదటి దఫా యూరియా వేసే దశకు వచ్చాయి. దీంతో డిమాండ్ పెరగడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారు



రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని కొందరు వ్యాపారులు చూస్తున్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమున్న అన్నిరకాల కాంప్లెక్స్, యూరియా, ఇతర కెమికల్స్ ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే రైతులకు పెట్టుబడి సహాయానికి రైతు భరోసా పంపిణీ చేసింది. రుణమాఫీ సైతం చేయడంతో రైతులు సంతోషంగా ఉన్న సమయంలో కొందరు ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారు.

– దుగ్యాల సంతోష్‌రావు, రైతు, శివపల్లి

సరిపడా నిల్వలు



ఆగస్టు పూర్తయ్యే వరకు స్టాక్ అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందొద్దు. కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి స్టాక్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రస్తుతం 9400 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఆగస్టులో 10వేల టన్నుల యూరియా అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న యూరియా నిల్వలు ఆగస్టు వరకు సరిపోతాయి.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి, పెద్దపల్లి

డ్రైనేజీల్లో చెత్త వేయొద్దు



పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: డ్రైనేజీల్లో చెత్త వేయొద్దని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ప్రజలను కోరారు. వివిధ డివిజన్లలో చేపట్టిన మురుగు నీటి కాలువల్లో పూడికతీత పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాలువల్లో చెత్త వేయొద్దంటూ స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం గాంధీనగర్‌లోని గోశాలను సందర్శించారు. మున్సిపల్ వాహన సేవలు ఉపయోగించుకొని కంపోస్ట్ యార్డ్‌కు వ్యర్థాలు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. విలీన గ్రామమైన లింగాపూర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులతోపాటు రోడ్ల పక్కన పెరిగిన తుమ్మ చెట్లు, పొదలు తొలగించి శుభ్రం చేశారు. అలాగే ఫైవింక్లయిన్ చౌరస్తాలోని బస్‌షెల్టర్‌ను ఆక్రమించిన వారిని ఖాళీ చేయించారు. వెంటనే బస్‌షెల్టర్ ఆవరణమంతా శుభ్రం చేయించి ప్రయాణికులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దారు. ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక పెద్ద కాలువ శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కిరణ్, మెప్మా సీవోలు ప్రియదర్శిని, శమంతకమణి, వార్డు అధికారులు, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, ఆర్పీలు, స్వశక్తి మహిళలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఆలయాల్లో శనివారం శ్రావణ సందడి నెలకొంది. పట్టణంలోని ఆలయాలకు భక్తులు బారులు దీరి శ్రావణమాస పూజలు చేశారు. పట్టణంలోని అమర్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శ్రీలక్ష్మిగణపతి, హనుమాన్ ఆలయాలకు సైతం భక్తులు పోటెత్తారు.

హైదరాబాద్ బీఆర్‌ఎస్వీ సదస్సులో పెద్దపల్లి నేతలు



సదస్సులో పాల్గొన్న పెద్దపల్లి నేతలు

పెద్దపల్లిరూరల్: బనకచర్ల ప్రాజెక్టు అక్రమాలపై బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి పలువురు నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సరికావని విమర్శించారు. నాయకులు లవన్‌కుమార్, శ్రీకాంత్, వాసు, మహేందర్, నరేశ్, లక్ష్మణ్, శ్రీకాంత్, రవి, అరుణ్‌కుమార్, మణికంఠ, హేమంత్ ఉన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం

రామగుండం: రామగుండంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న వంద పడకల సామర్థ్యం గల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభం కాకపోవడంపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ఈఎస్‌ఐ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.వంద కోట్లు నిధులు కేటాయించినా జిల్లా పరిపాలన అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమంటూ పార్లమెంట్‌లో ప్రస్తావించడంపై జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రాజెక్టు నత్తనడకన సాగుతోందని ఆరోపించడం గమనార్హం. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వేలాది మంది కార్మికులుండగా కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మినహా ఎటువంటి మెరుగైన వైద్యం కార్మికులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడే కార్మికులు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఉందని, ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసి మొగ్గు చూపించినా నిర్మాణంపై కలెక్టర్ అలసత్వంతోనే ప్రారంభం కావడం లేదన్నారు.

సామాజిక తనిఖీలో వెలుగులోకి అక్రమాలు



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ముత్తారం: ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన ఉపాధిహామీ సామాజిక తనిఖీలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2024 నుంచి 2025 మార్చి31 వరకు వేజెస్ రూ.2.82కోట్లు, మెటీరియల్ కింద రూ. 4.49కోట్ల పనులు జరిగాయి. మండలంలో జరిగిన ఉపాధి పనులపై రాష్ట్ర రిసోర్స్ పర్సన్ మామిడ్ల దేవేందర్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ గ్రామసభలో జరిగిన అక్రమాలను మండల సామాజిక తనిఖీ సభలో చదివి వినిపించారు. ఓడెడ్‌లో మెజర్‌మెంట్‌లో రూ.6వేలు అవకతవకలు జరిగాయని తెలిపారు. ఓడెడ్, ముత్తారం, హరిపురంలో ఉపాధి పనులకు గైర్హాజరైన కూలీలకు హాజరైనట్లు చూపించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు క్యాష్‌బుక్ నిర్వహించడం లేదని ఆడిట్ బృందం పేర్కొంది. ముత్తారం, పారుపల్లి, అడవిశ్రీరాంపూర్, మైదంబండ గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించిన అంచనా విలువ బోర్డులను పంచాయతీ తీర్మానం ద్వారా ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రయివేట్ వ్యక్తుల వెండర్‌లను పరిగణలోకి తీసుకోవడంతో రూ.3600 అవకతవకలు జరిగాయని ఆడిట్ బృందం వివరించింది. హరిపురం, ఇప్పలపల్లి, ఖమ్మంపల్లి, అడవిశ్రీరాంపూర్, లక్కారం, మచ్చుపేట గ్రామాల్లో కూలీ పనులకు రాకున్నా ముందస్తు సంతకాలు తీసుకొని బిల్లులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. సామాజిక తనిఖీ నిర్వహణ ఖర్చులు రూ.50వేలు చూపించారు. మండలంలో 14 పంచాయతీల్లో జరిగిన రూ.7.31కోట్ల పనులకు గాను రూ.13,732 రికవరీ చేయాలని ఉపాధి సామాజిక తనిఖీ ఏపీడీ సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కొమురయ్య, అంబుడ్స్‌మెన్ శరత్‌కుమార్, ఎంపీడీవో సురేశ్, సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ మామిడ్ల దేవేందర్, ఏపీవో దయమణి పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కోరుకంటి



గోదావరిఖని: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ కోరుకంటి చందర్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. తెలంగాణ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ట్రినిటి కాలేజ్‌లో కార్గిల్ విజయ్‌దివస్



ఎన్‌సీసీ కేడెట్లతో మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సీసీ కేడెట్లకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. మైభారత్ వారి ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ నీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాంచంద్రం, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లు సతీశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• గర్రెపల్లి ప్రధానరోడ్డులో డివైడర్ ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని రాజీవ్ రహదారి నుంచి నీరుకుల్లకు వెళ్లే ప్రధాన రోడ్డులో డివైడర్ ఏర్పాటు చేయాలని గర్రెపల్లి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల రవీందర్‌గౌడ్ కోరారు. శనివారం అసోసియేషన్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్ణంగా డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టారని, ప్రస్తుతం ప్రభుత్వం పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మించి డివైడర్‌తో పాటు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

• రోడ్లపై కేజ్‌వీల్స్‌తో పట్టుబడితే జరిమానా

పెద్దపల్లిరూరల్: కేజ్‌వీల్స్‌తో ఉన్న ట్రాక్టర్లు రోడ్లపై నడుపుతూ పట్టుబడితే జరిమానా చెల్లించాల్సిందేనని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కేజ్‌వీల్స్‌లో తిరగడంతో రోడ్లు ధ్వంసమై వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అంతేకాకుండా రోడ్లు కూడా ధ్వంసం అవుతున్నాయన్నారు. కేజ్‌వీల్స్‌తో నడుపుతూ తొలిసారి పట్టుబడితే రూ.5వేలు, రెండోసారి దొరికితే రూ.10వేలు, మూడోసారి దొరికితే రూ.20వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. చట్టప్రకారం కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

• విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని రాజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గడ్డి సతీశ్ శనివారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. సతీశ్, కావ్య తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఇంగ్లీష్, హిందీ పాఠ్యపుస్తకాలు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నిత్యావసర సరుకులు అందించారు. హెచ్‌ఎం మేరుగు రాజమౌళి, టీచర్ సమత ఉన్నారు.

• నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

జూలపల్లి: రైతులు నానో యూరియా ద్రావణం వాడితే అధిక ప్రయోజనాలు పొందొచ్చని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల గోదాంలో నిల్వలు, రికార్డులు శనివారం తనిఖీ చేశారు. సీఈవో సురేశ్, ఏఈవో శ్రీవాణి, కోఆర్డినేటర్ ఉన్నారు.

• జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి

రామగుండం: రామగుండం రైల్వే రన్నింగ్ విభాగంలో విధులు నిర్వహించే కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని శనివారం రైల్వే చీఫ్ క్ర్యూ కంట్రోలర్(సీసీసీ)కు తెలంగాణ రైల్వే కాంట్రాక్టు, క్యాజువల్, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అన్ స్కిల్డ్ కార్మికుడికి రూ.541, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.632, స్కిల్డ్ కార్మికులకు రూ.760 చెల్లించాలని, ప్రతీ నెల 7వ తేదీలోగా కార్మికులకు బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమచేయాలని కోరారు. సీఐటీయూ ప్రతినిధులు రామాచారి, బొంకూరి మహేశ్ ఉన్నారు.

• ఉరివేసుకుని యువకుడి మృతి

గోదావరిఖని: స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన గంధం సుమన్(36) శనివారం ఉరివేసుకుని మృతి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్య, పిల్లలు ఉన్నా ఇతనికి దూరంగా ఉంటున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నిన్నటి నుంచి కనిపించక పోవడతో చుట్టుపక్కల వారు గమనించడంతో విషయం వెలుగుచూసింది.

రోడ్డుపై నీరు నిలుస్తున్నా.. తొలగించరేమి?



పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రి ఎదురుగా ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీటితో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో బిజీగా ఉండే ఈ రహదారిపై నీరు నిలిచి ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతీసారి స్థానికంగా ఇదే పరిస్థితి నెలకొంటుందని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రహదారిపై నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రామగుండం: రెండునెలల క్రితం పాత ఎంపీడీవో కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ ఏరియాలోని వివిధ కాలనీలతో పాటు అక్బర్‌నగర్ వరకు భగీరథ తాగునీటి సరఫరా చేసేందుకు ప్రధాన రహదారి పక్క నుంచి కందకం తవ్వి పైపులైన్ వేశారు. కానీ పని పూర్తయిన తర్వాత చాలారోజుల వరకు కందకం పూడ్చకపోవడంతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో హుటాహుటిన మట్టితో కందకం పూడ్చారు. రోడ్డుకు సమానంగా మట్టి పూడ్చలేదు. దీంతో వర్షాలకు రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం ఎదుట పైపులైన్ కందకం ప్రమాదంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు

జ్యోతినగర్: న్యాయ సేవ.. విజ్ఞాన తోవ అని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, అదనపు జిల్లా జడ్జి, గోదావరిఖని డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం విశ్వభారతి హైస్కూల్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పేదలు, అర్హులైన వారికి మండల న్యాయ సేవాధికార సమితి బాసటగా నిలుస్తోందన్నారు. ఉచితంగా న్యాయసేవలు అందించడంతో పాటు సత్వర పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా నిరక్షరాస్యులు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంపొందించడానికి న్యాయ సేవాధికార సమితి కృషి చేస్తుందని వివరించారు. అనంతరం విశ్వభారతి విద్యాసంస్థల నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, న్యాయవాదులు తోటం సతీశ్, మొహమద్ ఉమర్, కుమార్, వరలక్ష్మి, గ్లోరీ, ఎన్టీపీసీ ఎస్సై లచ్చన్న, హెచ్‌ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బొగ్గు పరిశ్రమ పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ లక్ష్యంగా చేపట్టిన దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాల్లో సింగరేణి కార్మికులు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. 12ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన సవరణ జరగలేదన్నారు. కోల్ ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో నేటికీ అమలు కాలేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, సంస్థలో పరిపాలన విభాగం గాడి తప్పిందని, రాజకీయ జోక్యం పూర్తిగా తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24 నుంచి 31 వరకు బొగ్గు గనులపై గేట్ మీటింగ్‌లు, రెండోదశలో వచ్చేనెల 5 నుంచి 14వరకు కోల్‌బెల్ట్ ప్రాంత గ్రామాల్లో పల్లె నిద్ర, ప్రజలకు అవగాహన కోసం బహిరంగ సభలు, మూడో దశ వచ్చేనెల 25 నుంచి సెప్టెంబర్ 5 వరకు సింగరేణి కార్మిక వాడల్లో బహిరంగ సమావేశాలు, పత్రికా విలేకరుల సమావేశాలు నిర్వహణ ఉంటుందన్నారు. నాలుగో దశ సెప్టెంబర్ 15 నుంచి జీఎం ఆఫీసుల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు వైసారంపాణి, వేణుగోపాల్‌రావు, ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, పెంచాల వెంకటస్వామి, ఎల్లావుల కోటయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొద్దంతా ముసురే



సుల్తానాబాద్‌లో నిండుకుండలా ఊరచెరువు

సుల్తానాబాద్: జిల్లాలో శనివారం సైతం పొద్దంతా వర్షం కురిసింది. జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షం కురిసింది. వర్షంతో వరి, పత్తి సాగుకు వర్షం జీవం పోసినట్టయింది. నాలుగు రోజుల నుంచి వర్షాలు పడడంతో జిల్లాలో పలు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి.

వదలని వాన



జూలపల్లి: మండలంలో మూడురోజులుగా ముసురు వర్షం వదలడం లేదు. పొద్దంతా జల్లుల వర్షం పడడంతో వ్యవసాయ పనులు సాగలేదు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. చిన్నపాటి కుంటలకు వరద రాగా, పెద్దచెరువు, శివ చెరువు, రామప్ప చెరువుకు ఇప్పుడిప్పుడే ఇన్‌ఫ్లో ప్రారంభమైంది.

ఉద్యమకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

రామగిరి: రాష్ట్రంలోని ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని ఉద్యమకారుల ఫోరం సభ్యులు కోరారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారుల సమసమ్యలు ఆగస్టులో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మందకృష్ణ హామీ ఇచ్చారని వారు తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్యయాదవ్, మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, నూనె రాజేశం, బత్తుల శంకర్, కళాధర్ రెడ్డి, సుధాకర్, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మంథని: మున్సిపల్ పరిధిలోని సమస్యలపై కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కమిషనర్ పట్టించుకోవడం లేదని బోయిన్‌పేటకు చెందిన నాయిని సంతోష్ శనివారం కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సరిగా అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. అసలే వర్షాకాలం పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో అనుమతి లేకుండానే ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. మున్సిపల్‌లో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ లేడన్నారు. కమిషనర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో కోరినట్లు సంతోష్ తెలిపాడు.